ఉన్నత విద్య.. మిథ్య

- ప్యాపిలిలో డిగ్రీ కాలేజీ కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ఎన్నికల్లో హామీలు గుప్పించి.. మర్చిపోతున్న పాలకులు
- సుదూర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్న విద్యార్థినులు
- ఇంటర్‌తోనే చదువులకు స్వస్తి



ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా డిమాండ్లు వినిపిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థులు ఏటా ఇంటర్‌మీడియెట్ పూర్తి చేస్తున్నారు. అయితే స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో వీరిలో కొందరు డోన్, గుత్తి తదితర ప్రాంతాలకు ప్రతి రోజూ అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. మరికొందరు అనంతపురం, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను సుదూర ప్రాంతాలకు పంపలేక ఇంటర్‌తోనే చదువుకు స్వస్తి పలికిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులను బయటి ప్రాంతాలకు పంపలేని తల్లిదండ్రులు వారిని ఇళ్ల వద్దే ఉంచుతున్నారు. ప్యాపిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని పాలకులు ఎన్నికల్లో ఇస్తున్న హామీలు గాలి మూటలుగానే మిగిలిపోతున్నాయి. దీంతో డిగ్రీ కళాశాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

మూతపడిన ప్రైవేటు డిగ్రీ కళాశాల

పట్టణంలో పదేళ్ల పాటు కొనసాగిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల గత ఏడాది మూతపడింది. 2013 నుంచి 2023 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలను నిర్వహించారు. ఏటా 100 నుంచి 150 మంది విద్యార్థులు ఇక్కడ వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేవారు. ఎడారిలో ఒయాసిస్సులా ఉన్న ఆ ఒక్క కళాశాల కూడా మూతపడడంతో స్థానికంగా ఉంటూ చదువుకోవాలనుకున్న విద్యార్థులకు డిగ్రీ విద్య అందని ద్రాక్షలా మారింది. 52 గ్రామాలు ఉన్న ప్యాపిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్యాపిలిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయడంలో తమ వంతు కృషి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి



ప్యాపిలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం అందరికీ సాధ్యం కాదు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్యాపిలిలో డిగ్రీ కళాశాల నిర్మించాలి. ఉన్నత చదువులు స్థానికంగా అందుబాటులో ఉంటే వ్యయప్రయాసలు తగ్గుతాయి.

–రాకేష్, ప్యాపిలి

ఖర్చులు తగ్గుతాయి



ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులకు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. డిగ్రీ కళాశాల లేకపోవడంతో గతంలో చాలా మంది ఇంటర్‌తోనే చదువు మానేశారు. ఇక్కడే కళాశాల ఉంటే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులంతా డిగ్రీ కళాశాల కోసం ఎదురు చూస్తున్నారు. –పవన్ కళ్యాణ్, ప్యాపిలి

గ్రామీణ ప్రాంతాల్లో డిగ్రీ కళాశాల అవసరం



ప్యాపిలిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్యాపిలి చుట్టు పక్కల 30 గ్రామాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు ఏటా ఇంటర్ పూర్తి చేస్తున్నారు. స్థానికంగా డిగ్రీ కళాశాల లేక ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వచ్చే విద్యాసంవత్సరం నుంచే డిగ్రీ కళాశాలను ప్రారంభించాలి.

–అశోక్, ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి

క్లుప్తంగా

అయ్యప్పస్వామికి విశేష పూజలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి జన్మోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు చాణక్య ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, అష్టాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహంతో పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త విశ్వనాథం, గురుస్వాములు మురళీ, గడ్డం నాగేశ్వరరెడ్డి, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లెలో 13.2 మి.మీ వర్షపాతం

బనగానపల్లె: మండల కేంద్రంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 13.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న, మిరప పంటలకు నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో వరి నేలవాలింది. మిరప, మొక్కజొన్న దిగుబడులు వర్షానికి తడిచి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అవుకులో మోస్తరు వర్షం

అవుకు: మండలంలో గురువారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. కొండమీదిపల్లెల్లో సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. అవుకు మండలంలో 12.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షం ధాటికి కల్లాల్లో ఆరబెట్టిన మిరప, పొగాకు దిగుబడులు తడిచినట్లు రైతులు వాపోయారు. అలాగే వరిపంట నేలవాలింది.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



కోట్లవారిపల్లెలో జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల గౌరవ అధ్యక్షుడు కొయిలకొండ నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు నాగమద్దయ్య, వెంకట్రాముడు యర్రగుంట్ల, కోట్లవారి పల్లెలో జెండాలు ఆవిష్కరించారు.

కూలీలందరికీ పనులు

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండాలో పశువుల నీటి తొట్లె నిర్మాణాలను పరిశీలించారు. ఫారం పాండ్, నీటి తొట్టెలను వారంలోగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రతి గ్రామంలో 200 మంది ఉపాధి కూలీలతో పనులు చేయించాలని తెలిపారు.

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

కోవెలకుంట్ల: రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వం రెండో శనివారం సెలవు రద్దు చేసినట్లు కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కె. శివకుమార్ తెలిపారు. యథావిధిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని.. రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల ప్రజలు భూములు, స్థలాలు, ఇళ్లు, తదితర ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల: పట్టణంలోని గౌరీపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. 18వ తేదీ వరకు వివిధ వాహన సేవలు, విశేష పూజలు జరుగుతాయని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18వ తేదీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవరబండ, ధర్మారం, కన్నపకుంట గ్రామాల్లో పార్టీ నాయకులను కలుసుకుని వారికి భరోసా కల్పించారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పోస్టు ప్రసాద్, సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

బేతంచెర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి కాంతారావు నాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్ బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రహిమానుపురంలో సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల సర్వేను పరిశీలించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎస్ఆర్ అగ్రికల్చర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్‌మోసాలు, మహిళా చట్టాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు తెలియని నంబర్ల నుంచి వీడియోకాల్స్ చేయడం, వాట్సాప్‌లలో లింకు ఓపెన్ చేసుకోమని చెప్పడం, బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

బేతంచెర్ల: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శుక్రవారం అంతర్రాష్ట్ర స్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొత్తం 8 జతల వృషభాలు పాల్గొన్నాయి. కబడ్డీ పోటీలకు 20 జట్లు హాజరయ్యాయి. హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన అక్షరారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. కర్నూలు మండలం, తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి ద్వితీయ, నంద్యాల మండలం బోరెడ్డి నారాయణరెడ్డి ఎద్దులు తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత స్థానాల్లో కానాల –గుండం చెన్నారెడ్డి, మిడుతూరు –సాయి వర్ధన్, బేతంచెర్ల– మేకల భానుజ వృషభాలు నిలిచాయి. దాతల సహకారంతో విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం సురక్షితం



టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం సురక్షితమని.. సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శుక్రవారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లలోపు పిల్లల సంరక్షణ, జాగ్రత్తలు, ఆహారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, సూపర్‌వైజర్ అయ్యమ్మ, స్టాఫ్ నర్సులు ప్రభావతి, శివకుమార్‌గౌడ్, తులసి, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్ ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



దర్గాలో ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఫతేహాల సమర్పణ

కోవెలకుంట్ల: రేవనూరులోని ఉసేన్‌వలి దర్గాలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఉరుసు ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన జియారత్‌కు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉసేన్‌స్వామికి ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దర్గా ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉరుసు సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు దర్గా ముతవల్లి గఫార్‌మియా పేర్కొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి





కోవెలకుంట్లలో నివాళులర్పిస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, బేతంచెర్ల: మోడల్ స్కూల్‌లో..



డోన్ మున్సిపల్ కార్యాలయంలో..



ప్యాపిలి: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

సామాజిక సంస్కర్త, ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే జయంతిని డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఆయా కార్యాలయాలు, గ్రామాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. –సాక్షి నెట్‌వర్క్



డోన్: జ్యోతిరావు గురుకుల పాఠశాలలో..



బనగానపల్లె: ఏపీటీఎఫ్ కార్యాలయంలో..

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

బేతంచెర్ల: సిమెంట్‌నగర్‌లోని పర్వతవర్ధని రామనాథేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి ప్రాతఃకాల పూజలు, నిత్యార్చన, తదితర పూజలు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



బనగానపల్లె డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

కోవెలకుంట్ల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు కోవెలకుంట్ల డిపో గేటు ఎదుట శుక్రవారం రెండో రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివరాం మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని, 114 జీఓలో పొందుపరిచిన విధంగా నైట్అవుట్ అలవెన్సును రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని కోరారు. యూనియన్ నాయకులు పుల్లారెడ్డి, రాముడు, సుదర్శన్‌రెడ్డి, కేవీ సుబ్బయ్య, రమాదేవి, సునీత, భారతి పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు శ్రీనివాసులు, దేవేంద్రరెడ్డి, గఫార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- **డోన్ టౌన్:** డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శనరావు అన్నారు. శుక్రవారం రెండో రోజు డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. డిపో అధ్యక్షుడు రామయ్య, గ్యారేజ్ అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి మాధవస్వామి, సహాయ కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా

కొలిమిగుండ్ల: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ ఫక్కీరయ్య, ఈఓఆర్డీ శివప్రసాద్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొలిమిగుండ్ల మండలానికి 1,800 యూనిట్లు కేటాయించారని చెప్పారు. సోలార్ వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా పొందవచ్చన్నారు. మూడు కిలో వాట్ల సోలార్‌కు రూ.1.45 లక్షలు ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు భరిస్తుందన్నారు. లబ్ధిదారులు మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాల పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిలబడి నిరీక్షించాల్సిందే



బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

కొలిమిగుండ్ల: బస్సుల కోసం బస్టాప్‌ల వద్దకు చేరుకున్నా కాసింత సేపు కూర్చోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రజలు నిలబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి అంకిరెడ్డిపల్లెలో నెలకొంది. మండల కేంద్రం కొలిమిగుండ్ల కంటే జనాభా, ఓటర్ల పరంగా పెద్ద గ్రామం. జీవిచెట్లు, ఏపీజీబీ బ్యాంక్, చింతలాయిపల్లె రోడ్డులో బస్సులు కోసం ప్రజలు వేచి చూస్తుంటారు. బస్‌షెల్టర్లు లేకపోవడంతో గంటకుపైనా నిలబడి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోజు తాడిపత్రి, కొలిమిగుండ్ల, జమ్మలమడుగు, బనగానపల్లె, నంద్యాల తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కూర్చునేందుకు ఎక్కడా అవకాశం లేకుండా పోయింది. జీవి చెట్ల వద్ద వైఎస్సార్‌సీపీ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి నిధులతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్థానికులు, మందుబాబులు తిష్టవేస్తుంటారు. విద్యార్థులు, మహిళలు బస్సుల కోసం వచ్చిన సమయంలో లేచి వాళ్లకు అవకాశం ఇవ్వకుండా పిచ్చాపాటిగా మాట్లాడుతుంటారు. మూడు చోట్ల బస్టాప్‌ల వద్ద షెల్టర్లు ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిబూడిదైన మొక్కజొన్న పంట

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామ శివారులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన బాలరంగయ్య, శివకుమార్, రాజశేఖర్, రాధాకృష్ణ, చంద్రుడు తదితర రైతుల పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. రైతులందరూ సుమారు 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకుంది. 8 ఎకరాల్లో మొక్కజొన్న పంట కాలిబూడిదైంది. డోన్ అగ్నిమాపక సిబ్బంది వచ్చినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు మొత్తం రూ. 10 లక్షలు నష్టం జరిగింది. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె, పాతపాడు, పసుపల విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు సరఫరా చేస్తామని తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

- **డోన్ టౌన్:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వాహణ పనుల కారణంగా పట్టణంలోని పాతపేట, కొండపేట, చాకిరేవు మిట్ట, ఇందిరానగర్, కేఈ మాదన్ననగర్, పండరినగర్, కురుకుంద కాలనీ, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న సబ్‌స్టేషన్ హైవే ఫీడర్ 11 కేవీ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలోని పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్: అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 13వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుస్మిత తెలిపారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు సంబంధించి డోన్, ప్యాపిలి కేంద్రాల్లో ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

సారా విక్రేతకు 14 రోజుల రిమాండ్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోటపాడుకు చెందిన నాటుసారా విక్రేతకు 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని నీళ్ల ట్యాంక్ వద్ద మాదిగ చిన్న రాయుడు నాటుసారా విక్రయిస్తుండడంతో దాడి చేశామన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బనగానపల్లె జడ్జి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వెల్లడించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



బేతంచెర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

బేతంచెర్ల: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై శుక్రవారం బేతంచెర్లలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో జెండాపేట మసీదు నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ముర్తుజావలి, పిట్టల జాకీర్, ఖాజా హుసేన్, సద్దాం, సికిందర్ అలీ తదితరులు పాల్గొన్నారు.